బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడో..?

- నత్తనడకన సాగుతున్న శివారెడ్డిగూడెం–రెడ్డినగర్ బ్రిడ్జి పనులు
- 2022లో పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తికాని వంతెన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


శివారెడ్డి గూడెం - రెడ్డినగర్ మధ్య నిర్మిస్తున్న హైలెవల్ వంతెన

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని శివారెడ్డిగూడెం–రెడ్డినగర్(దంతూర్) గ్రామాల మధ్య చిన్నేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నాలుగేళ్లుగా సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన లో- లెవ్ బ్రిడ్జి స్థానంలో వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.6.22 కోట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా 2022 జనవరిలో నిర్మాణ పనులు ప్రారంభించారు.

గడువు పొడిగించినా..సాగని పనులు

అగ్రిమెంట్ ప్రకారం చిన్నేటి వాగుపై 153.23 మీటర్లు పొడవు, 10 పిల్లర్లు(వెంట్స్)తో బ్రిడ్జి పనులు 2023 సెప్టెంబర్‌లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలి. కానీ ఈ మూడేళ్ల కాలంలో పది పిల్లర్లకు 7 పిల్లర్లు మాత్రమే పూర్తయ్యాయి. అయితే చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఏడాదిపాటు నిలిపేశారు. పనుల జాప్యం వల్ల 2023 సెప్టెంబర్‌తో ఆ గడువు ముగిసింది. అయితే ప్రభుత్వం మరోసారి ఈ ఏడాది మార్చి 31 వరకు గడువు పొడిగించిన పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతి లేదు. రెండోసారి ఇచ్చిన గడువు కూడా త్వరలో ముగియనుంది. పనులు మాత్రం ఆగుతూ నత్తనడకన సాగుతున్నాయి.

తప్పని తిప్పలు..

ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి, రెడ్డిబావి తదితర గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రావడానికి, ఇటు ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, పెద్ద రావులపల్లి గ్రామాల ప్రజలు చౌటుప్పల్‌కు వెళ్లడానికి ఇదే ప్రధానమార్గం. దీంతో ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రైతులు కూడా తమ పంట పొలాల వద్దకు ఇదే మార్గం గుండా వెళ్తుంటారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే వాగు వద్ద గుంతలదారి కన్పించక రాత్రివేళలో ద్విచక్రవాహనదాలు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలోనైతే లోలెవల్ బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులను త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో బ్రిడ్జి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం పనులు మొదలుపెట్టారు. కానీ ఇంకా పిల్లర్ల దశలోనే పనులు నడుస్తున్నాయి. వర్షాకాలం వస్తే ఈ మార్గంలో రాకపోకలు బంద్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగుదాటే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.
– బొక్క ఎల్లారెడ్డి, శివారెడ్డిగూడెం

నాలుగైదు నెలల్లో పూర్తి చేస్తాం



ప్రస్తుతం పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 50శాతం పనులు పూర్తయ్యాయి. మరో మూడు పిల్లర్లు, స్లాబ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాగులో నీటి ప్రవాహం వల్ల పనుల్లో జాప్యం జరిగింది. వర్షాకాలంలో వరద ప్రవాహం వల్ల పనులకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ వేసవిలో పనులను వేగవంతం చేశాం. నాలుగైదు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.
– ప్రసాద్, స్పెషల్ ఏఈ, భూదాన్‌పోచంపల్లి

స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలి


ఈఓ భాస్కర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న కళాకారులు, సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కోరారు. తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులతో పాటు స్థానిక కళాకారులకు కొండపైన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ భాస్కర్ రావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పేరబోయిన పెంటయ్య, మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బంగారి, కళాకారులు కంది రేణుక, అండాలు, చిలుకు కవిత, నరసమ్మ, శ్వేత, పుట్టల ఉమా పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు


పుష్పాలను తీసుకుని ప్రదర్శనగా వస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ తడక లతావెంకటేశం, తడక విష్ణుదాస్, తడక గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంకం వినోద్, మాజీ కౌన్సిలర్ మోటె రజిత రాజు, మురళి, ధర్మకర్తలు మోటె మహేశ్, సుధీర్, వేశాల మురళి, కూరపాటి బాబు, నాగయ్య, సుభాష్‌గౌడ్, పెద్దల ముత్యాలు, రాములు, బాలాజీ, కావ్య, బాలకృష్ణ, ముత్యాలు, వెంకటేశం, శివకుమార్, జింకల కుమార్, శ్రీను, చెర్కు శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, మణికుమార్ పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

- చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : వేసవిలో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు, ఎల్ఆర్ఎస్‌పై గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఏయో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందో ఆ గ్రామాలను గుర్తించి యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. అవసరమైన గ్రామాల్లో రైతుల నుంచి బోర్లను అద్దెకు తీసుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి, ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే తాగునీటి సమస్య ఉంటే ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. వేసవిలో ప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా ఇంటర్‌బోర్డు అధికారిణి రమణి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దీన్‌దయాల్, ఎంఈఓ ప్రభాకర్, ఏఈలు సాయినాథ్, లింగయ్య, ఇరిగేషన్ శాఖ ఏఈఈలు స్వప్న, మమత, ఆర్‌ఐలు గుత్తా వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఏపీఓ కృష్ణమూర్తి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాటి వెంకటేశం

చౌటుప్పల్ : చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాటి రామచంద్రం సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం అన్నారు. దివంగత మాజీ మార్కెట్ చైర్మన్ తాటి రామచంద్రం జ్ఞాపకార్థం సేవా సమితి సహకారంతో పట్టణ కేంద్రంలోని బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రం ద్వారా మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. రాజీవ్‌యూత్ అధ్యక్షుడు చెరుకు లింగస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాశం సంజయ్‌బాబు, తిరుపతి రవీందర్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, మొ గుదాల రమేష్‌గౌడ్, బొడిగె బాలకృష్ణ, ఎస్‌కె.జానిబాబు, శామకూర రాజయ్య, ఆవుల ఏసు, సామకూర యాదయ్య, నర్సింహ, దయాకర్‌రెడ్డి, పందుల రాజేష్, వెంకటేష్, బొంగు రమేష్, వర్కాల రాముగౌడ్, రఫీ, గంగరాములు, గోపి యాదవ్, గణేష్, ముత్యాల గణేష్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం ఇవ్వాలి


భువనగిరి : ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు


భూదాన్‌పోచంపల్లి : లో-లెవల్ బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


రామన్నపేట : నీర్నెములలో వంతెనను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి : ఎండిన వరి పంటలకు ఎకరానికి రూ.30వేల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని హన్మాపురం గ్రామంలో సీపీఎం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, తోటకూరి గణేష్, నాగరాజుతో పాటు రైతులు అంజయ్య, ఐలయ్య, మల్లయ్య,బాలరాజు, నర్సింహ, బాలయ్య, సురేష్, కిష్టయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

భూదాన్‌పోచంపల్లి : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మెహర్‌నగర్ గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ శివారులోని లోలెవల్ బ్రిడ్జి కోతకు గురైందని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామానికి బస్సు సర్వీస్‌ను నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, శాఖ కార్యదర్శి కోట అశోక్, నాయకులు కోట రమేశ్, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, కోట భిక్షపతి, భూపాల్, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామంలో నెలకొన్న సమస్యలపై బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండలఅధ్యక్షుడు బోయిని ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ మాట్లాడుతూ కొత్తగూడెంకు వెళ్లేదారిలో ఆసీఫ్‌నహర్ కాలువపై ఇరుగ్గా ఉన్న వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలన్నారు. పాత పాఠశాల స్థలంలో గ్రంథాలయాన్ని నిర్మించాలన్నారు. పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌కు నూతన భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి నాగటి అంజయ్య, నాయకులు బండ జగన్‌మోహన్‌రెడ్డి, నేమనంది లింగయ్య, నాగటి మహేష్, బోయిని మల్లేష్, వల్లె వెంకట్‌రెడ్డి, బెల్లం సత్తయ్య, దాసరి నర్సింహ, బోయిని రామచంద్రం, ఆవుల మల్లేష్, సుర్వి ఎల్లయ్య, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవిందమ్మ, ఉపాధ్యాయులు మునగపాటి వరమ్మ, మామిడి కవిత, డెక్కెం విజయలక్ష్మి, ప్రశాంతి, ఉషా, కనకమ్మ పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంతో పాటు కొరటికల్, పల్లెపహాడ్, మొరిపిరాల, కప్రాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాంబోజు భాను, నాయకులు కోల సత్తయ్య, సుంచు నాగరాజు, సుంకరి పరుశరాములు, సతీష్, అకిరెడ్డి శ్రవణ్, నూనెముంతల విజయ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు ఆహ్వానం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య, బయ్యని రాజు, బండారు వెంకట్‌రెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో స్తంభంపై మంటలు

ఆలేరురూరల్: ఆలేరు పట్టణ కేంద్రంలోని మంతపురి రోడ్డులో తంజాప్ గోదాం పక్కన బుధవారం సాయంత్రం కరెంట్ స్తంభం మీద షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో స్తంభం మీద ఉన్న కేబుల్ వైర్లు కాలిపోయాయి. విద్యుత్ అధికారులు వచ్చి కరెంట్ బంద్ చేసి మంటలు ఆర్పివేశారు. అయితే విద్యుత్ అధికారులకు సమయానికి స్పందించలేదని స్థానికులు ఆరోపించారు.

గుండెపోటుతో యువకుడి మృతి


నిమ్మల రాజు(ఫైల్)

రామన్నపేట: గుండెపోటుతో మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన నిమ్మల రాజు(34) అనే యువకుడు బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజు ఉదయం ఆరు గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని, ఆస్పత్రికి వెళ్తామని తన సోదరుడు మధుకు ఫోన్ చేశాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యులు సీపీఆర్‌తోపాటు, ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య పేర్కొన్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు


మాసాన్‌పల్లిలో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు


మాసాన్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం పనులు

గుండాల : మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండలంలోని మాసాన్‌పల్లి అంగన్‌వాడీ సెంటర్–2కు పక్కా భవనం కోసం టీఎంఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆర్నెళ్ల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా ఇటీవల ఆ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి వైద్య శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.20 లక్షల నిధులు మంజూరవగా ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించారు.కాగా పిల్లర్ల దశలోనే ఆ పనులు వదిలేశారు. గ్రామ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తిస్థాయిలో నిర్మించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

భువనగిరిటౌన్ : ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. సమావేశానికి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ్రపల్లి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కూరెల్ల యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి.రమేష్, అధ్యక్షుడిగా రాజెల్ల, ఉపాధ్యక్షులుగా సీహెచ్ శాంత, ప్రధాన కార్యదర్శిగా సంతోష, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాహుల్, సునిత, శోభారాణి, సుశీల, కవిత పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి

భువనగిరి : బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జూపల్లి దీపిక అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరవింద్, సాయికిరణ్, మధు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

మోత్కూరు : స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా నేటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గూదె మధుసూదన్ యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షులు పోచం సోమయ్య ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


డీపీఆర్ఓ అరుంధతిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్,తదితరులు

భువనగిరిటౌన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, జెడ్పీ సీఈవో శోభ రాణి , జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, ఉపాధి కల్పనాధికారి సాహితీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

భువనగిరిటౌన్ : ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు. దీక్షలో మాదిగ కళా మండలి ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ జేరిపోతుల కరుణాకర్ మాదిగ, బండారు శివశంకర్, పముకుంట్ల బసవయ్య, పెద్దుల శ్రీనివాస్, గందమల్ల మనోజ్, మంచాల మహేష్ పాల్గొన్నారు

పంటలకు బీమా సౌకర్యం కల్పించాలి

బొమ్మలరామారం : పంటలకు భీమా సౌకర్యం కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి కాటం ఐలేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రైతు సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జూపల్లి భరత్, బెజ్జంకి పాపిరెడ్డి, తుమ్మల ఉపేందర్, నాగిరెడ్డి రఘుపతి రెడ్డి, చాగంటి పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

భువనగిరిటౌన్ : జుక్షియో టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, గొరిగే సోములు, జిల్లా సహాయకార్యదర్శి మాయ కృష్ణ , జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, పైళ్ల గణపతిరెడ్డి, పొట్ట యాదమ్మ, పోతరాజ్ జహంగీర్ , బత్తుల దాసు, పుప్పాల గణేష్, కందాడి దేవేందర్ రెడ్డి, కూరెళ్ల నర్సింహ, గడ్డం వెంకటేశం పలువురు నాయకులు తదతరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై బదిలీ

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సి.శ్రీకాంత్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. మూడేళ్లుగా మోత్కూరు మున్సిపల్ మేనేజర్‌గా, ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సి.శ్రీకాంత్ పదోన్నతిపై నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

భువనగిరిటౌన్ : మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు. బుధవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఐద్వా ఫౌండేషన్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, జిల్లా కమిటీ సభ్యురాలు మాయ రాని, టౌన్ కమిటీ సభ్యురాలు అంబటి లలిత, సునీత, మంజుల, పావని, అలివేలు, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : ఐద్వా పోరాటాల ఫలితంగా అనేక మహిళ చట్టాలను సాధించుకున్నామని ఐద్వా మండల అధ్యక్షురాలు కర్నాటి మత్స్యరాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శీలం ఇందిరా, గరుదాసు నర్మదా, దుబ్బ లతా, వేముల లలిత, కూర మంగమ్మ, నాగలక్ష్మి, పద్మ, రజిత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ నల్ల రవి ఇటీవల మృతి చెందాడు. బుధవారం అతడి కుటుంబాన్ని లైట్ వెహికిల్స్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు పరామర్శించి రూ.7వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బోడ బాబురావు, అధ్యక్షుడు మెంట సురేష్, ఉపాధ్యక్షులు షేక్ బాబర్, ఎడ్ల రాము, కోమటి అనిల్, పంగ నాగరాజు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన అల్వాల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి గ్రామస్తులు బుధవారం రూ.6 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో దూదిగామ యాకమ్మనాగరాజు, చీనూరు స్వప్న, సోమయ్య, అల్వాల సుజాత, వెంకన్న తదితరులు ఉన్నారు.

పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలి

మోటకొండూర్: మండల కేంద్రంలోని పెద్ద వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటకొండూర్ నుంచి వలిగొండ వరకు డబుల్ రోడ్డును వేసి ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో బొలగాని జయరాములు, కొల్లూరి ఆంజనేయులు, సుధాకర్, వడ్డెబోయిన మహేందర్, కొల్లూరి రమేష్, చెరుకు అనిల్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

భూదాన్‌పోచంపల్లి : పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు బుధవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయినవారిలో మాజీ సర్పంచులు మన్నె పద్మారెడ్డి, సోముల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి తరలి వెళ్లకుండా మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయినవారిలో కేసరి రాంరెడ్డి, ఏనుగు అంజి రెడ్డి, శేఖర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పశువుల సంత వేలాన్ని బుధవారం ఎంపీఓ మజీద్ సమక్షంలో నిర్వహించారు. గ్రామ గ్రామానికి చెందిన కడెం బీరప్ప రూ.91.18లక్షలకు, సైకిల్ స్టాండ్‌ను రూ.5.91లక్షలకు వేలంలో దక్కించుకున్నారు.